జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 175 11-7-2026 వెల: రూ.2/- పేజీలు: 06






## ఆ ముగ్గురూ పవన్‌ను టార్గెట్ చేశారు

- పవన్‌ను లక్ష్యంగా చేసుకుని జడా శ్రావణ్, ప్రకాశ్ రాజ్, రావణ్ కుట్ర అంటూ మంత్రి ఫైర్
- వీరి వెనుక వైసీపీ, తాడేపల్లి స్క్రిప్ట్ ఉందని కందుల దుర్గేశ్ ఆరోపణ
- జగన్‌పై పోరాటానికి రూ. 25 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో శ్రావణ్ చెప్పాలని డిమాండ్
- ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకే మత ఘర్షణలు రెచ్చగొడుతున్నారని ఫైర్
- ప్రశ్నించడం అంటే బూతులు తిట్టడమేనా అని తీవ్ర విమర్శ


2లో

# చెన్నైలో బిగ్ బాష్

## డిసెంబర్‌లో ఆస్ట్రేలియా టి--20 క్రికెట్ ఆరంభ మ్యాచ్

## భారత్‌లో తొలిసారిగా విదేశీ క్రికెట్ లీగ్ మ్యాచ్

## క్రీడా సహకార రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించిన మోదీ, అల్బనీస్



మెల్‌బోర్న్: శిక్షణ, క్రీడా విజ్ఞానం, సాంకేతికత, క్రీడా పరిశ్రమ రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని భారత్, ఆస్ట్రేలియా నిర్ణయించుకున్నాయి. ఇందుకోసం శుక్రవారం క్రీడా సహకార రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించాయి. ఇందులో భాగంగా తమిళనాడు రాజధాని చెన్నైలో బిగ్ బాష్ లీగ్ (టీ--20) ఆరంభ మ్యాచ్ నిర్వహించనున్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో చెన్నైలోని ఎం.ఎ.చిదంబరం స్టేడియం (చేపాక్) వేదికగా జరగనున్న

మిగతా 2లో

## ఏపీలో పెట్టుబడులకు కొరియా సంస్థల సానుకూలత..

- నాయుడుపేటలో రూ.1,595 కోట్లతో ప్లాంట్ ఏర్పాటు చేయనున్న షిన్‌హ్యూప్
- ఈ ప్లాంట్ ద్వారా 2,170 మందికి ఉద్యోగ అవకాశాలు
- శ్రీసిటీలో ఈవీ విడిభాగాల యూనిట్ ఏర్పాటు చేయాలని మోటివ్‌లింక్‌కు విజ్ఞప్తి
- ఏపీలో ఎండ్-టు-ఎండ్ పీసీబీ క్లస్టర్ ఏర్పాటుకు సహకరించాలని కోరిన లోకేశ్



2లో



## ఇరాన్‌పై అనుమానాస్పద దాడులు

- పలు ప్రాంతాల్లో వైమానిక దాడులు, పేలుళ్లు
- తమకు సంబంధం లేదని అమెరికా ప్రకటన
- బహ్రెయిన్, జోర్డాన్, కువైట్, ఖతార్‌పై ప్రతీకార దాడులకు దిగిన ఇరాన్





# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం...

- సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- రూ.31,431 కోట్ల విలువైన పెట్టుబడులకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం
- అమరావతిలో భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు పెంపు.. కీలక నిర్ణయం
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
- రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు సరికొత్త విధానానికి గ్రీన్ సిగ్నల్

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ఆర్థిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, సోషల్ మీడియా నియంత్రణ వంటి అనేక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం, దానిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోబోతోందని ఆయన స్పష్టం చేశారు.

మిగతా 2లో

2లో

## అయోధ్యలో విరాళాల చోరీపై.. 13న సుప్రీం విచారణ

యూపీ పోలీసుల దర్యాప్తుపై నమ్మకం లేదు

సీబీఐతో దర్యాప్తు చేయించాలంటూ దాఖలైన పిటిషన్లు

## ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని

# మొలకెత్తనివ్వం

- తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు 26 కు పెరుగుతాయి
- 119 అసెంబ్లీ స్థానాలు 182 కు పెరుగుతాయి
- 182 అసెంబ్లీ స్థానాల్లో 117 సీట్లు గెలిచి రెండోసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది
- భద్రాచలం రాములవారి మీద ఆన...

ఇది ఖమ్మం కాంగ్రెస్ కార్యకర్తల మాట

- బ్యాడుమేళం బ్యాచ్ లా బీఆరెస్ సర్వేల బ్యాచ్ తయారైంది
- బీజేపీ లోకి వెళ్ళనని హరీష్ రావును కేసీఆర్ పై ఒట్టేసి చెప్పమను
- బీఆరెస్ ను బీజేపీ లో విలీనం చేస్తారని నీ సొంత చెల్లెలే చెబుతోంది
- ఆంధ్ర కాంట్రాక్టర్లు బీఆరెస్ కి వందల కోట్లు ఇచ్చారని నీ సొంత చెల్లే చెప్పింది



**ఖమ్మం:**

తెలంగాణలో రాష్ట్రం లో రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో 182 అసెంబ్లీ స్థానాలకు 117 సీట్లు గెలిచి రెండవసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాథపురంలో రైతు ఆశీర్వాద సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా తుది విడత నిధులను బటన్ నొక్కి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. అనంతరం భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.


మిగతా 2లో

## మాట తప్పుడు.. పార్టీలు మారడం నీ సంస్కృతి

**రేవంత్ 20 ఏళ్ల రాజకీయ చరిత్రనే దానికి నిదర్శనం**

**ఆయనలా ఒట్టు వేసి ఒక మాట, వేయకుండా మరోమాట చెప్పే అలవాటు నాకు లేదు : హరీశ్‌రావు**

హైదరాబాద్: మాట తప్పడం..పార్టీలు మారడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయ సంస్కృతి కావొచ్చని, తనది కాదని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు అన్నారు. రేవంత్ 20 ఏళ్ల రాజకీయ చరిత్ర, తన 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానమే అందుకు నిదర్శనమన్నారు. రేవంత్‌లా ఒట్టు వేసి ఒకమాట, ఒట్టు వేయకుండా మరోమాట చెప్పే అలవాటు తనకు లేదని చెప్పారు. భద్రాద్రి శ్రీరాముడి సాక్షిగా సంపూర్ణ రుణమాఫీ చేస్తానని చేసిన ప్రమాణం ఏమైందని ప్రశ్నించారు.



# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం...



**(మొదటి పేజీ తరువాయి)**

సమాజానికి సోషల్ మీడియా దుర్వినియోగం ఒక రోగంలా పరిణమించిందని, దాని వల్ల మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతోందని కేబినెట్ అభిప్రాయపడింది. వ్యక్తిత్వ హననం, ప్రభుత్వాలపై అబద్ధపు ప్రచారం, మహిళలను కించపరచడం వంటివి శ్రుతిమించుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో అనైతిక కార్యకలాపాలను ఏమాత్రం ఉపేక్షించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి పార్థసారథి తెలిపారు. దీని కోసం కొన్ని కీలక చర్యలను కేబినెట్ ఆమోదించిందని వివరించారు.

**భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్**

రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపీబీ) ఆమోదించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 13 ప్రాజెక్టులకు సంబంధించి రూ.31,431 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా రాష్ట్రంలో 31,431 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తిరుపతి జిల్లా శ్రీసిటీలో మాండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1801 కోట్లతో ఏర్పాటు చేయనున్న చాక్లెట్ తయారీ యూనిట్ వీటన్నింటిలో ముఖ్యమైనది. ఈ యూనిట్ ద్వారా దేశంలోనే కోకో వినియోగించి చాక్లెట్లు తయారు చేయడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానానికి చేరుకుంటుందని మంత్రి వివరించారు. అలాగే వేస్ట్ ఆయిల్స్‌ను ఏవియేషన్ ఫ్యూయల్‌గా మార్చేందుకు ఎస్ఏఎఫ్ఎఫ్ ఇండియా ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు కూడా ఆమోదం తెలిపారు.

**అమరావతిపై కీలక నిర్ణయాలు**

అమరావతికి సంబంధించి కేబినెట్ పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. రాజధానిలో భూములు ఇచ్చిన రైతులకు ఊరట కల్పిస్తూ వార్షిక కౌలును పెంచింది. జూన్ 12, 2024 తర్వాత ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద భూములు ఇచ్చిన రైతులకు ఈ పెంపు వర్తిస్తుంది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30,000 నుంచి రూ.40,000కు, జరీబు భూములకు రూ.50,000 నుంచి రూ.60,000కు వార్షిక కౌలును పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీరికి 10 సంవత్సరాల పాటు ఈ కౌలు చెల్లిస్తారు. అలాగే, గ్రామ కంఠాల్లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చే నెలవారీ పరిహారాన్ని రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచుతూ 12 నెలల పాటు అందించాలని తీర్మానించారు. వీటితో పాటు, అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ వంటి సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపారు. ముఖ్యంగా, నేషనల్ ఫిషరీస్ బోర్డు ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో అక్వేరియం, ఆర్నమెంటల్ ఫిష్ బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది.

**విద్యారంగానికి పెద్దపీట**

సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు మూడు "సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్" ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని విశాఖపట్నం, నెల్లూరు, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏర్పాటు చేస్తారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన శిక్షణ ఇచ్చి, పేద విద్యార్థులను ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పార్థసారథి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రకటించింది. రాష్ట్రంలో సంగీత కచేరీలు (జశీఅషవతీం), కార్నివాల్స్ వంటి భారీ ఈవెంట్లను నిర్వహించే వారికి 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్' కింద ఆర్థిక సహాయం అందించనుంది. 20,000 మంది లోపు హాజరైతే రూ.2 కోట్లు, 20,000 నుంచి 50,000 మధ్య హాజరైతే రూ.5 కోట్లు, 50,000 దాటితే రూ.5 కోట్ల వరకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తుంది. దీనికి తోడు, ప్రభుత్వ ఆధీనంలోని పెద్ద మైదానాలను ఉచితంగా వాడుకునేందుకు కూడా అవకాశం కల్పిస్తుంది.

**సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణ**

సాగు, తాగునీటి ప్రాజెక్టులపై కేబినెట్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. పెద్దగడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు పనులకు సంబంధించి ఐదుసార్లు టెండర్లు విఫలమైన నేపథ్యంలో, 14.88 శాతం ఎక్కువకు కోట్ చేసిన టెండర్‌ను ఆమోదించింది. కుప్పం బ్రాంచ్ కెనాల్ నుంచి చెరువులకు నీటిని అందించే పనులకు రూ.67.98 కోట్లకు పరిపాలన ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా 'జలధార' కార్యక్రమం పురోగతిని సమీక్షించాలని, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తాగునీరు, పశు గ్రాసంపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.

**భూ సమస్యల పరిష్కారానికి చర్యలు**

దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. గుంటూరు జిల్లా పుల్లడిగుంట గ్రామంలో దశాబ్దాలుగా నివసిస్తున్న 200 కుటుంబాలకు ఊరట కల్పిస్తూ, వారు నివసిస్తున్న 10.16 ఎకరాల 'తోపు పోరంబోకు' భూమిని పట్టా భూమిగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఇలాంటి భూ వర్గీకరణ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వేలాది కుటుంబాలకు న్యాయం చేస్తామని, మార్చి 2027 నాటికి పరిష్కరించగల అన్ని రెవెన్యూ సమస్యలను పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారని మంత్రి పేర్కొన్నారు.

# చెన్నైలో బిగ్ బాష్

**(మొదటి పేజీ తరువాయి)**

ఆస్ట్రేలియన్ మెన్స్ బిగ్ బాష్ లీగ్(బీబీఎల్) ప్రారంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ పెర్త్ స్కార్చర్స్ జట్టుతో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ తలపడనుంది. తద్వారా భారతదేశంలో ఒక విదేశీ క్రికెట్ లీగ్ మ్యాచ్ నిర్వహిస్తుండడం ఇదే మొదటిసారి కానుంది. మొదటి మ్యాచ్ చెన్నైలో, మిగిలిన మ్యాచ్‌లు ఆస్ట్రేలియాలో జరుగుతాయి. ఎనిమిది జట్లు పాల్గొనే బీబీఎల్.. ఐపీఎల్ తర్వాత ప్రపంచంలోనే అత్యధిక ఆదరణ పొందిన దేశీయ క్రికెట్ టీ--20 లీగ్‌లలో ఒకటి కావడం విశేషం. ఇది సాధారణంగా డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్య కాలంలో జరుగుతుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ శుక్రవారం ప్రతిష్టాత్మక మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇద్దరు నేతలు స్టేడియం అంతటా కలియతిరుగుతూ సందడి చేశారు. ఫోన్‌లో సెల్ఫీలు దిగారు. ఫొటోలకు పోజులిచ్చారు. ప్రజలకు అభివాదంచేస్తూ ఉత్సాహపర్చారు. పరస్పరం ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. 'చెన్నైలో బిగ్ బాష్ లీగ్ మ్యాచ్ నిర్వహిస్తుండడం నాకు సంతోషంగా ఉంది. భారతదేశంలో మ్యాచ్‌లు నిర్వహించే ఏ క్రీడా లీగ్ అయినా భారీగా ప్రేక్షకులను ఆకర్శించడం ఖాయం"అని మోదీ పేర్కొన్నారు. భారత్--ఆస్ట్రేలియా క్రీడా సహకార రోడ్‌మ్యాప్‌ను మోదీ, అల్బనీస్ సంయుక్తంగా విడుదల చేశారు. క్రీడా శిక్షణ, క్రీడా విజ్ఞానం, సాంకేతికత, క్రీడా పరిశ్రమ, పెట్టుబడుల రంగాల్లో భాగస్వామ్యాలను ప్రోత్సహించాలన్నదే ఈ రోడ్‌మ్యాప్ ఉద్దేశం. రోడ్‌మ్యాప్‌లో భాగంగా యువ క్రీడాకారుల మధ్య పరస్పర సహకారాన్ని ప్రోత్సహించడానికి, క్రీడా సంబంధాలను బలోపేతం చేయడానికి ఇరు దేశాలు యూత్ స్పోర్ట్స్ ఫెస్టివల్‌ను కూడా నిర్వహించబోతున్నాయి. ప్రజలను ఏకం చేసే శక్తి క్రీడలకు ఉందని, ఈ రోడ్‌మ్యాప్ భారత్, ఆస్ట్రేలియా మధ్య క్రీడా భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడానికి తోడ్పడుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మహిళల క్రికెట్ ప్రపంచ కప్ గెలిచినందుకు ఆస్ట్రేలియాను అభినందించారు. భారత్, ఆస్ట్రేలియాలు అంతర్జాతీయ క్రీడల్లో ఒక ముఖ్యమైన దశాబ్దంలోకి అడుగుపెడుతున్నాయని పేర్కొ న్నారు. క్రీడల పట్ల ఉన్న ప్రేమ, అభిరుచి ఆస్ట్రేలియా, భారత్‌ను ఐక్యం చేశాయని ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ వ్యాఖ్యానించారు.

**విపక్ష నేతతో మోదీ భేటీ**

ఆస్ట్రేలియా ప్రతిపక్ష నాయకుడు యాంగస్ టేలర్‌తో ప్రధాని మోదీ శుక్రవారం సమావేశమయ్యారు. భారత్--ఆస్ట్రేలియా ద్వైపాక్షిక సంబంధాలపై వారిద్దరూ చర్చించుకున్నారు. ఇరుదేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంపై అభిప్రాయాలు పంచుకున్నారు. మోదీ మూడు రోజుల ఆస్ట్రేలియా పర్యటన శుక్రవారం ముగిసింది

# ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని మొలకెత్తనివ్వం

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పదేళ్ల పాటు బీఆర్ ఎస్ రాక్షస పాలన సాగిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వారిపాలనలో రైతుల కు బేడీలు వేశారని మండిపడ్డారు.దీంతో ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ అనేది లేకుండా ప్రజలు చేశారని ఆయన చెప్పుకొచ్చారు. ఖమ్మం జిల్లాలో 2023 లో ఓ అద్భుతం జరిగింది. కాంగ్రెస్ పార్టీ లోకి అడుగుపెట్టిన పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెంట ఆనాడు కాంగ్రెస్‌లోకి ఉప్పెనలా జనం వచ్చారు. కారు పార్టీని ప్రజలు ఇక్కడ మళ్ళీ మొలకెత్తనివ్వరు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ డబ్బు మూటలను కాంగ్రెస్ తట్టుకోలేదని కొందరు అన్నారు. అయితే 65 సీట్లలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని చెప్పి మరీ గెలిచి చూపించాం. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆ పార్టీకి గుండు సున్నా వచ్చేలా చేశామన్నారు. 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవు. తెలంగాణలో 2029 జూన్‌లోనే అసెంబ్లీ ఎన్నికలు వస్తాయి. 2029లో జరిగే కురుక్షేత్రంలో మళ్లీ గెలిచేది కాంగ్రెస్సే. పార్లమెంట్ సీట్లు 26, అసెంబ్లీవి 182కి పెరుగుతాయి. 182లో 117 సీట్లు గెలిచి రెండోసారి ప్రజాపాలన వస్తుంది. భద్రాచల రాముడిపై ఆన ఇది కాంగ్రెస్ కార్యకర్తల ప్రతిజ్ఞ అన్నారు . కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళా నికి తొక్కుతాం. పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌లో బంధించాం. ఆ పాపాల భైరవుడికి ఇకపై విముక్తి లేదు. ఆనాడు వరి వేస్తే ఉరి వేసినట్లే అని



కేసీఆర్ అన్నారు. కానీ మేం వ్యవసాయం దండగ కాదు పండుగ అన్నాం. పేదలకు సన్నబియ్యం వడ్లకు బోనస్ అందిస్తున్నాం. అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేశాం. ప్రతి సందర్భంలోనూ వారిని ఆదుకుంటూ వస్తున్నాం. రైతు కళ్ల ల్లో ఆనందమే మాకు ఆశీర్వాదం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అధికారం పోయిందనే అక్కసుతోనే ప్రభు త్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. బావా బామ్మర్దులిద్దరూ ఊళ్ల పై పడి తెగ తిరుగుతున్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని విష ప్రచారం చేశారు. ఇప్పుడు కరెంట్ తీగలు పట్టుకోండి.సలసల మాడి పోతారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్. ఆనాడు డబుల్ బెడ్ రూమ్‌ల పేరుతో సినిమా కథలు చెప్పారు. ఇప్పుడు పొంగులేటి 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నారని అన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ లు ఓపెన్ చేయాలని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. కన్నెపల్లి పంప్‌లు ఆన్ చేస్తే భద్రాచల రాముడి ఆలయం సహా 44 గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని సీఎం రేవంత్ రెడ్డి వాఖ్యానించారు.బీజేపీ లో చేరెందుకు హరీశ్ రావు, మంతనాలు జరుపుతున్నారో లేదో భద్రాచల రాముడిపై ఒట్టేసి చెప్పాలన్నారు.

## ఆ ముగ్గురూ పవన్‌ను టార్గెట్ చేశారు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు వైసీపీ భారీ కుట్రకు తెరలేపిందని, అందులో భాగంగానే జడా శ్రావణ్ కుమార్, నటుడు ప్రకాశ్ రాజ్, యూట్యూబర్ జోసెఫ్ రావణ్ పనిచేస్తున్నారని రాష్ట్ర మంత్రి, జనసేన నేత కందుల దుర్గేశ్ సంచలన ఆరోపణలు చేశారు. పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ ముగ్గురూ తాడేపల్లి నుంచి వస్తున్న ఒకే స్క్రిప్ట్‌ను అమలు చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మేధావుల ముసుగులో వీరు చేస్తున్న ప్రయత్నాలు, వైఎస్ జగన్‌తో జడా శ్రావణ్ భేటీ కావడంతో బట్టబయలయ్యాయని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేశ్, జడా శ్రావణ్‌ను లక్ష్యంగా చేసుకుని పలు సూటి ప్రశ్నలు సంధించారు. "జగన్‌పై పోరాటానికి రూ. 25 కోట్లు సొంత డబ్బులు ఖర్చు పెట్టానని చెప్పిన శ్రావణ్‌కు అంత సొమ్ము ఎలా వచ్చిందో చెప్పాలి. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన, తక్కువ కాలం జడ్జిగా పనిచేసి, తర్వాత సాధారణ న్యాయవాదిగా ఉన్నారు. అలాంటి వ్యక్తికి అంత డబ్బు ఎలా వస్తుంది? మాకు తెలిసిన సమాచారం ప్రకారం, అవినీతి కేసుల్లో ఉండటం వల్లే ఆయన జడ్జి ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అలాగే, సుగాలి ప్రీతి తల్లిని మోసం చేసిన మాట వాస్తవం కాదా?" అని దుర్గేశ్ నిలదీశారు. జోసెఫ్ రావణ్, శ్రావణ్, ప్రకాశ్ రాజ్‌ల మధ్య ఉన్న 'క్యాష్ బంధం' ఏంటో బయటపెట్టాలని దుర్గేశ్ డిమాండ్ చేశారు.

## మాట తప్పుడు.. పార్టీలు మారడం నీ సంస్కృతి

**(మొదటి పేజీ తరువాయి)**

రాష్ట్రం సంగతి పక్కన పెడితే, ముఖ్యమంత్రి సభ నిర్వహించిన ఖమ్మం జిల్లాలో అయినా రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగిందా అని నిలదీశారు. ఒకవైపు చివరి ఏడాదిలో రాజకీయాలు చేద్దామంటూ, మరోవైపు ప్రతి సభలో అసహనంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. శుక్రవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా హరీశ్‌రావు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ప్రస్తు తం లక్ష క్యూసెక్కుల ప్రవాహం ఉన్నా పంపులను ఆన్ చేయకుండా నీటిని దిగువకు వదిలేయడం తెలంగాణ రైతాంగంపై నమ్మక ద్రోహమేనని హరీశ్‌రావు ఆరోపించారు. రోజుకు మూడు టీఎంసీల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం ఉన్న పంపులు సిద్ధంగా ఉన్నా, ప్రభుత్వం కావాలనే వినియోగించడం లేదన్నా రు. కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసి అన్నారం, సుందిళ్ల మీదుగా ఎల్లంపల్లికి తరలించాలని రిటైర్డ్ ఇంజనీర్లు సూచిస్తున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు.

ఎల్లంపల్లి నుంచి సాగునీరు, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి, మిషన్ భగీరథ, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు పెద్దఎత్తున నీరు అవసరమవుతుందని, ఆ పరిస్థితిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు హెచ్చరికలు వస్తున్న సమయంలో లభ్యమవుతున్న ప్రతి చుక్క నీటిని ఒడిసిపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణలో గోదావరి జలాలు అందుబాటులో ఉన్నా, వాటిని వినియోగించకుండా ఆంధ్రప్రదేశ్‌కు వదిలేయడం జలద్రోహమేనని హరీశ్‌రావు ఆరోపించారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో 24 మోటార్లు నిరంతరాయంగా పనిచేస్తూ ఇప్పటికే 60 టీఎంసీలకు పైగా నీటిని వినియోగించుకుంటుంటే, తెలంగాణలో సిద్ధంగా ఉన్న బాహుబలి పంపులను ఆన్ చేయకపోవడం వెనుక చీకటి ఒప్పందం ఏమిటని ప్రశ్నించారు.

## ఏపీలో పెట్టుబడులకు కొరియా సంస్థల సానుకూలత..

ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ హబ్‌గా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా, సియోల్‌లో ప్రముఖ ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ సంస్థలైన మోటివ్‌లింక్, షిన్‌హ్యూప్ ఎలక్ట్రానిక్స్ యాజమాన్యాలతో ఆయన కీలక సమావేశాలు నిర్వహించారు. ఏపీలో తయారీ యూనిట్లు స్థాపించి, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో భాగస్వాములు కావాలని వారిని ఆహ్వానించారు. ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల (పీసీబీ) తయారీలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన షిన్‌హ్యూప్ ఎలక్ట్రానిక్స్ ఛైర్మన్ టేహూ కిమ్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. తిరుపతి జిల్లా నాయుడుపేటలో రూ.1,595 కోట్ల భారీ పెట్టుబడితో తమ సంస్థ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ఈ సందర్భంగా టేహూ కిమ్ ప్రకటించారు. ఈవీ/ఆటో, హెల్త్‌కేర్, స్మార్ట్ మీటరింగ్ రంగాలకు అవసరమైన పీసీబీలు, సీసీఎల్, ఈఎంఎస్‌లను ఇక్కడ తయారు చేయనున్నట్లు తెలిపారు.

## ఇరాన్‌పై అనుమానాస్పద దాడులు

దుబాయ్: ఇరాన్‌పై వరుసగా వైమానిక దాడులు జరగడం తీవ్ర కలకలం సృష్టించింది. తాము దాడులు పూర్తిస్థాయిలో నిలిపివేశామని అమెరికా ప్రకటించిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. తాజా అనుమానాస్పద దాడులతో తమకు సంబంధం లేదని అమెరికా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకున్నది ఎవరన్నది అంతుబట్టడం లేదు. దివంగత సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీని ఖననం చేయడానికి ఇరాన్ సన్నద్ధమవుతున్న తరుణంలోనే గురువారం దక్షిణ ఇరాన్‌లోని వివిధ ప్రాంతాల్లో వైమానిక దాడులు జరిగాయి. దీనికి కారణం ఎవరన్న దానిపై ఇరాన్ కూడా ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా సాగిస్తున్న ప్రచారానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) మద్దతు ఇస్తోందంటూ ఇరాన్ చట్టసభ సభ్యుడు ఒకరు ఆరోపించారు. అమెరికాకు సహకరించినందుకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇటీవల అమెరికా చేసిన దాడుల్లో యూఏఈ తెర వెనుక పాత్ర పోషించిందని మండిపడ్డారు. ఇరాన్‌పై తాజా వైమానిక దాడుల పట్ల గల్ఫ్ దేశాలు కూడా స్పందించలేదు. ఇరాన్ బద్ధశత్రువైన ఇజ్రాయెల్ కూడా మౌనం వహించింది. ప్రపంచ ఇంధన మార్కెట్లకు కీలక జలమార్గమైన హార్ముజ్ జలసంధిని తక్షణమే తెరవాలని, నౌకల రవాణాకు వీలు కల్పించాలని అమెరికా పట్టుబడుతున్న తరుణంలో ఇరాన్‌పై వరుసగా దాడులు జరిగాయి.

## అయోధ్యలో విరాళాల చోరీపై.. 13న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: అయోధ్య రామాలయం విరాళాల చోరీ వ్యవహారంలో సీబీఐ దర్యాప్తు, ఆర్థిక లావాదేవీల ఆడిట్ కోరుతూ దాఖలైన మూడు పిటిషన్లపై విచారణకు సుప్రీంకోర్టు అంగీకరించింది. వేసవి సెలవుల అనంతరం కోర్టు పునఃప్రారంభమయ్యే రోజున, ఈ నెల 13న ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టనుంది. రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అందే విరాళాలు, కానుకలు చోరీకి గురవుతున్నాయని, నిధులు దుర్?వినియోగమవుతున్నాయని న్యాయవాదులు అజయ్ కుమార్ రాయ్, దినేశ్ కుమార్ యాదవ్, ఆర్జేడీ ఎంపీ సుధాకర్ సింగ్, నరేంద్ర కుమార్ గోస్వామి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పోలీసు ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తుపై తమకు నమ్మకం లేదని పిటిషనర్లు పేర్కొన్నారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





# వానదేవుడా కరుణించు.. పల్లెల్లో 'బొడ్రాయి' పూజలు

- గంగమ్మ ఆలయంలో, శివాలయంలో శివునికి జలాభిషేకాలు
- రైతాంగం సుభిక్షంగా ఉండాలని రాజాపేటలో వేడుకోలు

**తొలివెలుగు, రాజాపేట:** వానలు సమృద్ధిగా కురవాలని, సకాలంలో వర్షాలు పడి ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కాంక్షిస్తూ శుక్రవారం రాజాపేట పట్టణ కేంద్రంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఆశించిన స్థాయిలో వానలు పడకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో కరువు పరిస్థితులు తొలగిపోవాలని స్థానిక గంగమ్మ ఆలయం, శివాలయం, బొడ్రాయి వద్ద పూజలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక శివాలయంలో పరమశివునికి అర్చకులు శాస్త్రోక్తంగా జలాభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామ బొడ్రాయి వద్దకు మహిళలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చారు. వేప కొమ్మలతో అలంకరించిన నీళ్ల కడవలను బొడ్రాయి వద్ద ఉంచి పురోహితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక అర్చనలు చేశారు. వానదేవుడు కరుణించి పంటలు పండేలా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజాపేట పురోహితులు, గ్రామ పెద్దలు, అఖిలపక్ష నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిబద్ధతకు దక్కిన గుర్తింపు.. పీఏసీఎస్ చైర్మన్‌గా నమిల మహేందర్ గౌడ్

- 36 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో తొలిసారి ప్రజాప్రతినిధిగా ఎంపిక
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు తెలిపిన శ్రేణులు




**తొలివెలుగు, రాజాపేట :** కాంగ్రెస్ పార్టీకి, స్థానిక నాయకత్వానికి నమ్మినబంటుగా ఉంటూ దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న రాజాపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్‌కు అరుదైన గౌరవం దక్కింది. రాజాపేట మండలం రేణికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నామినేటెడ్ చైర్మన్‌గా ఆయన నియమితులై బాధ్యతలు స్వీకరించారు. 54 ఏళ్ల వయస్సు గల మహేందర్ గౌడ్.. తన 36 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నడూ పార్టీ లైన్ దాటకుండా కాంగ్రెస్ పట్ల నిబద్ధతతో వ్యవహరించారు. 1990లో యువజన కాంగ్రెస్ ద్వారా రాజకీయ అరంగేట్రం చేసిన ఆయన, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ఆలేరు ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా, మండల ఓబీసీ అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పనిచేశారు. 2016 నుంచి పదేళ్లపాటు రాజాపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో 1994, 1999 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు అహర్నిశలు కృషి చేశారు. 2019 ఎంపీటీసీ ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ అధైర్యపడకుండా ప్రజాక్షేత్రంలోనే కొనసాగారు. ఎట్టకేలకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చొరవతో ఆయనకు పీఏసీఎస్ చైర్మన్‌గా మొదటిసారి ప్రజాప్రతినిధి అవకాశం దక్కింది. ఆయన నియామకం పట్ల కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

# రైతు సేవలో.. నూతన పాలకవర్గం

- నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి: విప్ ఐలయ్య

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలంలోని రేణికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గం శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. సంఘం కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్ నమిల మహేందర్ గౌడ్‌తో పాటు పాలకవర్గ సభ్యులందరిచే ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా విప్ ఐలయ్య నూతన చైర్మన్‌ను, సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. రైతుల అభ్యున్నతి కోసం పనిచేసే సహకార సంఘాలను మరింత బలోపేతం చేయాలని, ప్రభుత్వ పథకాలను అర్హులైన రైతులకు పారదర్శకంగా అందించాలని కోరారు. చైర్మన్‌గా నమిల మహేందర్ గౌడ్, సభ్యులుగా గుజ్జల బాలరాజు, జంగా లక్ష్మి, భూక్య మన్య, కోరే మల్లయ్య, రాపోలు నారాయణరెడ్డి, మసిరెడ్డి సురేందర్ రెడ్డి, కోటగిరి సంతోష, జూకంటి వీరయ్య, గుడిసెల నరసింహులు, చెట్కూరి గౌరయ్య, చెక్కల బాలయ్య, చిగుళ్ల చంద్రపాల్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సెక్రటరీ సిల్వేరు చంద్రశేఖర్ గౌడ్, వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, ఎంపీపీలు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రంగా నరేష్ గౌడ్, ఉప సర్పంచ్ నమిల కేదారి, జిల్లా కార్యదర్శి ఇంజ నరేష్, ఎంబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రశాంతంగా పోచంపల్లి చేనేత సహకార సంఘ ఎన్నికలు





- రికార్డు స్థాయిలో 97 శాతం పోలింగ్ నమోదు
- పోలింగ్ సరళిని పరిశీలించిన చేనేత జౌళిశాఖ ఏడీ శ్రీనివాస్

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని చేనేత సహకార సంఘం ఎన్నికలు శుక్రవారం ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఉదయం ప్రారంభంలో మందకొడిగా సాగిన పోలింగ్, మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా ఊపందుకుంది. ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి క్యూలైన్లలో వేచి ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి యూసఫ్ అలీ మాట్లాడుతూ.. సంఘంలో మొత్తం 644 మంది ఓటర్లు ఉండగా, 623 మంది ఓటు వేశారని, దీంతో దాదాపు 97 శాతం పోలింగ్ నమోదైనట్లు వివరించారు. కాగా, ఓట్ల లెక్కింపులో ఓపెన్ కేటగిరీలో 31 ఓట్లు, మహిళల విభాగంలో 10 ఓట్లు చెల్లకుండా (రిజెక్ట్) పోయాయని ఆయన పేర్కొన్నారు.

**అధికారుల తనిఖీ:**

ఎన్నికల ప్రక్రియ సాగుతున్న తీరును జిల్లా చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు (ఏడీ) శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో సందర్శించారు. పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

**మున్సిపల్ ఎన్నికలను తలపించిన పోరు:**

సాధారణ సహకార ఎన్నికలైనా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఇవి మున్సిపల్ కౌన్సిలర్ ఎన్నికలను తలపించాయి. ప్యానెళ్ల వారీగా వ్యూహప్రతివ్యూహాలు అమలు చేయడంతో పాటు, ఓటర్లను ఆకర్షించేందుకు తెరవెనుక పెద్ద ఎత్తున ఖర్చులు చేసినట్లు పట్టణంలో విస్తృత ప్రచారం సాగింది. ప్యానెళ్ల పరంగానే కాకుండా, అభ్యర్థులు వ్యక్తిగతంగా కూడా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.






# లక్ష్మక్కపల్లి గ్రామపంచాయతీ భవనం ప్రారంభం

- రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని లక్ష్మక్కపల్లి గ్రామపంచాయతీ నూతన కార్యాలయ భవనాన్ని శుక్రవారం ప్రభుత్వ విప్, ఆలేరు నియోజకవర్గ శాసనసభ్యుడు బీర్ల ఐలయ్య అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయ ఆవరణలో రిబ్బన్ కట్ చేసి నూతన భవనాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పల్లెల ప్రగతికి, ప్రజా పరిపాలన సులభతరం చేసేందుకు గ్రామపంచాయతీ భవనాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మక్కపల్లి సర్పంచ్ ఇండ్ల రాజాలు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వేముల సురేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ పుప్పాల సిద్ధులు, ముఖ్య నాయకులు నారెడ్డి భాస్కర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, సతీష్ రెడ్డి, కృష్ణ, రాము, చైతన్య, రజిని, భరత్, అలివేలు, సిద్ధులు తదితర కాంగ్రెస్ శ్రేణులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# పోచంపల్లి చేనేత 'సహకారం'.. లవ కుమార్ ప్యానెల్ కైవసం



- 96.73 శాతం నమోదైన పోలింగ్.. ఉత్సాహంగా ఓటేసిన చేనేత కార్మికులు
- విజేతలను శాలువాలతో సత్కరించిన మద్దతుదారులు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పట్టణంలో శుక్రవారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన పోచంపల్లి చేనేత సహకార సంఘం ఎన్నికల్లో భారత లవ కుమార్ ప్యానెల్ ఘనవిజయం సాధించింది. సంఘం పరిధిలోని మొత్తం 644 మంది ఓటర్లకు గానూ రికార్డు స్థాయిలో 623 మంది చేనేత కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో మొత్తం 96.73 శాతం పోలింగ్ నమోదైంది. కాగా, పోలైన ఓట్లలో 34 ఓట్లు వివిధ కారణాల వల్ల చెల్లకుండా (రిజెక్ట్) పోయాయని, మిగిలిన 589 ఓట్లను లెక్కించి విజేతలను ప్రకటించినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

**జనరల్ విభాగంలో విజేతలు:**

కడవేరు చంద్రమౌళి (424 ఓట్లు), భారత లవ కుమార్ (416 ఓట్లు), సూరపల్లి శ్రీనివాస్ (354 ఓట్లు), సీత శ్రీశైలం (345 ఓట్లు), గంజి బసవ లింగం (341 ఓట్లు), కోడి బిక్షపతి (281 ఓట్లు), భారత వాసుదేవ్ (243 ఓట్లు) ఘనవిజయం సాధించారు.

**మహిళల విభాగంలో విజేతలు:**

మహేశ్వరం నాగమణి (429 ఓట్లు), పాలాది జ్యోతి (396 ఓట్లు) విజయకేతనం ఎగురవేశారు. భారత లవ కుమార్ ప్యానెల్ స్పష్టమైన ఆధిక్యతతో విజయం సాధించడంతో చేనేత వర్గాల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి. ఫలితాల అనంతరం మద్దతుదారులు, కార్మికులు విజేతలకు పూలమాలలు వేసి, గజమాలలతో సత్కరించి మిఠాయిలు పంపిణీ చేశారు.

# ఘునాథపురం సర్కారు బడిలో 'బాలల' అక్షర దీప్తి





- ప్రీ-ప్రైమరీ స్కూల్‌ను ప్రారంభించిన సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్
- అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణ పనులకు శ్రీకారం
- మహిళా సంఘం, అంగన్‌వాడీ భవన పనులకు శంకుస్థాపన

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని రఘునాథపురం గ్రామంలో శుక్రవారం నూతన ప్రీ-ప్రైమరీ పాఠశాలను గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి (ఎంఈఓ) చంద రమేష్, పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి చిన్నారులకు శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం చేయించి విద్యాబుద్ధులు నేర్పించారు. అనంతరం గ్రామంలో మహిళా సంఘం అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణ పనులకు సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు, ముఖ్యంగా ప్రాథమిక స్థాయి నుంచి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



## రాజాపేటలో వైభవంగా నగర సంకీర్తన

- ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు

**తొలివెలుగు, రాజాపేట:** ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాజాపేట పట్టణ కేంద్రంలో భక్తబృందం ఆధ్వర్యంలో నగర సంకీర్తన వైభవంగా నిర్వహించారు. మర్కూక్ శ్రీ భావానంద స్వామి వారి ఆశీస్సులతో, అదరాసుపల్లి శ్రీధర్ శర్మ పర్యవేక్షణలో రాజాపేట శాఖ అధ్యక్షుడు నంగునూరు రాజు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక శ్రీ రామకృష్ణ సాయి మందిరం నుంచి భక్తులు హరేరామ నామస్మరణతో భజనలు చేస్తూ ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లారు. మార్గమధ్యంలో పలు ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో దేవతామూర్తులకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, మంగళహారతి నిర్వహించి, ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా భక్తులు సామూహికంగా భావానంద అష్టక పారాయణం చేశారు. ఆధ్యాత్మిక వాతావరణంలో సాగిన ఈ పూజల్లో నంగునూరు జగదాంబ, నంగునూరు రాజు, బిర్రు శ్రీనివాసులు, బిర్రు లక్ష్మి, బోగ లత, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## గోశాలలో గరుకు స్తంభం ప్రతిష్ఠాపన



- తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రఘునాథపురం దంపతుల వితరణ
- ఏకాదశి పర్వదినాన గోవులకు ప్రత్యేక పూజలు

**తొలివెలుగు, రాజాపేట:** ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాజాపేట మండలం చల్లూరు గ్రామ సమీపంలో గల కటుకం నామ్‌దేవ్ శ్రీకృష్ణ గోశాలలో ప్రత్యేక గోసేవా కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని రఘునాథపురం గ్రామానికి చెందిన లోక పాండురంగం, దేవిక దంపతులు తమ మాతాపితరుల జ్ఞాపకార్థం గోశాలలోని గోమాతల కొరకు 'గరుకు స్తంభాన్ని' వితరణగా అందించి, ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా గోశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన గరుకు స్తంభం వద్ద అర్చకుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అనంతరం గోమాతలకు ప్రత్యేక హారతులు ఇచ్చి, గ్రాసము, పండ్లు సమర్పించారు. పర్వదినం నాడు గోసేవ చేయడం విశేష పుణ్యఫలమని, మూగజీవాల సౌకర్యార్థం స్తంభాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని గోశాల నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోశాల సిబ్బంది, రఘునాథపురం గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట బిఆర్ఎస్ మహా ధర్నా

- కాళేశ్వరం నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్
- తరలివచ్చిన రాజాపేట మండల నాయకులు, రైతులు

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి/రాజాపేట:** సాగునీరందక ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలని, కాళేశ్వరం జలాలను వెంటనే విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుని నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమానికి రాజాపేట మండల పరిధిలోని రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బీఆర్ఎస్ రాజాపేట మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ ఆధ్వర్యంలో తరలివచ్చిన నాయకులు కలెక్టరేట్ గేటు ముందు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మాజీ శాసనసభ్యురాలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇంచార్జ్ క్యామ మల్లేష్, మాజీ ఎమ్మెల్యేలు బూడిద బిక్షమయ్య గౌడ్, పైళ్ల శేఖర్ రెడ్డి, ఎలిమినేటి సందీప్ రెడ్డి, చింతల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. రాజాపేట మండలం నుంచి ఆలేరు ఏఎంసీ మాజీ డైరెక్టర్ గుర్రం నర్సింలు, ఆత్మ డివిజన్ మాజీ చైర్మన్ మేక వెంకటేశ్వర్లు రెడ్డి, పులి చంద్రమౌళి, సిద్ధులు, సురేష్ తదితర ముఖ్య నాయకులు, రైతులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.



# బడికి వస్తే.. 'ట్యాంక్' కడిగించారు!

- భూదాన్ పోచంపల్లి జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడి నిర్వాకం
- సెలవు తెలియక వచ్చిన విద్యార్థులతో వెట్టి చాకిరీ.. సర్వత్రా విమర్శలు
- హెచ్ఎం తీరుపై తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆగ్రహం.. విచారణకు డిమాండ్





**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పాఠశాలకు చదువుకోవడానికి వచ్చిన విద్యార్థుల చేత పనులు చేయించినట్లు వచ్చిన ఆరోపణలు యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తీవ్ర చర్చకు దారితీశాయి. విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన విద్యా మందిరంలో వారితో నీటి ట్యాంకులు శుభ్రం చేయించినట్లు ఆరోపణలు రావడంతో తల్లిదండ్రులు, స్థానికులు, విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాల పిలుపు మేరకు ప్రైవేట్ విద్యాసంస్థలు బంద్ పాటించగా, ప్రభుత్వ పాఠశాలలకు కూడా సెలవు ప్రకటించినట్లు సమాచారం. అయితే ఆ విషయం తెలియని కొందరు 9వ, 10వ తరగతి విద్యార్థులు యథావిధిగా పాఠశాలకు వచ్చారు. ఆరోపణల ప్రకారం, ఉదయం ప్రార్థన అనంతరం విద్యార్థులను ఇంటికి పంపించకుండా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వారితో పాఠశాల ఆవరణలోని టాయిలెట్లపై ఏర్పాటు చేసిన నీటి ట్యాంకులను శుభ్రం చేయించినట్లు తెలుస్తోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, విద్యార్థుల చేతులకు బకెట్లు, చీపుర్లు ఇచ్చి టాయిలెట్ భవనంపైకి ఎక్కించి వాటర్ ట్యాంకులను కడిగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎలాంటి భద్రతా చర్యలు లేకుండా చిన్నారులను ఎత్తైన ప్రదేశాలకు ఎక్కించి పనులు చేయించడం అత్యంత ప్రమాదకరమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు స్థానికంగా చక్కర్లు కొడుతున్నాయి.

**భద్రతను విస్మరించారా..?**

విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన పాఠశాల యాజమాన్యం, ప్రమాదకరమైన పరిస్థితుల్లో పిల్లలతో పనులు చేయించడం ఎంతవరకు సమంజసమని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. చదువు నేర్పించాల్సిన గురువులే విద్యార్థులను ఇలాంటి పనులకు ఉపయోగించడం బాధాకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ప్రమాదం జరిగి ఉంటే బాధ్యత ఎవరిది..?**

టాయిలెట్ భవనంపైకి ఎక్కి ట్యాంకులు శుభ్రం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యార్థులు కిందపడినా, ఇతర ప్రమాదాలు జరిగినా బాధ్యత ఎవరు తీసుకునేవారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులతో ఇలాంటి పనులు చేయించడం అనుమతించబడదని, అయినప్పటికీ ఈ ఘటన ఎలా జరిగిందని నిలదీస్తున్నారు.

**విద్యార్థి సంఘాల ఆగ్రహం:**

ఈ ఘటనపై విద్యార్థి సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో విద్యార్థులతో వెట్టిచాకిరీ చేయించడం పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. సంబంధిత ప్రధానోపాధ్యాయుడిపై విద్యాశాఖ అధికారులు వెంటనే విచారణ జరిపి, వాస్తవాలను వెలికితీసి తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**విచారణకు డిమాండ్:**

ఈ ఘటనపై విద్యాశాఖ ఉన్నతాధికారులు స్వయంగా స్పందించి పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించరాదని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# అర్హులందరికీ ఓటు హక్కు.. అనర్హులకు నో ఛాన్స్!

- వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ
- జాబితాలో పారదర్శకతకు పెద్దపీట వేయాలి
- హాజరైన కలెక్టర్ అనురాగ్ జయంతి



**తొలివెలుగు, హైదరాబాద్/యాదాద్రిభువనగిరి:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా సేకరించిన దరఖాస్తుల డిజిటలైజేషన్ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ ఆదేశించారు. శుక్రవారం న్యూఢిల్లీ నుంచి ఆయన ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్‌తో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఎన్నికకు ముందు ఓటర్ల జాబితాను నవీకరించడం ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హుడికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటి సర్వేను సమర్థవంతంగా నిర్వహించి, ఈ నెల 24వ తేదీ నాటికి డిజిటలైజేషన్ ప్రక్రియ వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. విచారణ లేకుండా ఏ ఒక్క ఓటరు పేరును జాబితా నుంచి తొలగించరాదని స్పష్టం చేశారు. అలాగే, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణలో భాగంగా ఎక్కడా 1,200 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉండకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 99.6 శాతం, డిజిటలైజేషన్ 21.94 శాతం పూర్తయిందని, మిగిలిన పనిని వేగవంతం చేస్తామన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా సవరణ ప్రక్రియ పూర్తి చేస్తామని వివరించారు. సమావేశంలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

# పిల్లల ఆరోగ్యానికి 'నులిపురుగుల' చెక్!




- 13న నులిపురుగుల నిర్మూలన దినోత్సవం
- జిల్లాలో 1.43 లక్షల మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ
- అధికారుల సమీక్షలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి :** జిల్లాలో ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ (ఎన్ డీ డీ) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల వయస్సు గల 1,43,614 మంది పిల్లలు, యువతకు అల్బెండజోల్ మాత్రలను అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. 13న మాత్రలు తీసుకోని వారికి తిరిగి ఈ నెల 20న మాప్-అప్ డే నిర్వహించి పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు బడిబేటపట్టని పిల్లలనూ గుర్తించి మాత్రలు వేయాలన్నారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, కడుపునొప్పి, ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు వస్తాయని, ఈ మాత్రలతో వాటిని నివారించవచ్చని పేర్కొన్నారు. మాత్రలను భోజనం తర్వాతే ఇవ్వాలని, వయస్సుకు తగిన మోతాదులోనే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డా. ఎం. మనోహర్, విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# చౌటుప్పల్ కాంగ్రెస్‌లో వర్గపోరు!




## నాయకుల మధ్య పెరిగిన అంతర్గత విభేదాలు

- క్షేత్రస్థాయిలో నలిగిపోతున్న ద్వితీయ శ్రేణి శ్రేణులు
- గ్రూపు రాజకీయాల మధ్య నలిగిపోతున్న (క్యాడర్) హస్తం పార్టీ
- 'ఎవరికి వారే యమునా తీరే' అన్న చందంగా స్థానిక నేతల తీరు.
- కొత్తగా వచ్చిన వారికే పెద్దపీట.. సీనియర్ల తీవ్ర ఆవేదన
- 'మండల వర్సెస్ టౌన్' గా చీలిన పార్టీ.. ఒకరి ప్రోగ్రామ్‌కు మరొకరు డుమ్మా.
- స్థానిక పరిస్థితిపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తి?
- పరిస్థితి చక్కదిద్దకపోతే బీఆర్ఎస్, బీజేపీల వైపు వలసలు తప్పవని హెచ్చరిక.

**తొలివెలుగు, చౌటుప్పల్ :** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఉత్సాహంతో చౌటుప్పల్ పరిధిలో పార్టీని మరింత బలోపేతం చేసుకోవాల్సిన కాంగ్రెస్ శ్రేణులు.. ప్రస్తుతం అంతర్గత విభేదాలతో సతమతమవుతున్నాయి. చౌటుప్పల్ కాంగ్రెస్‌లో రెండు ప్రధాన వర్గాల మధ్య నడుస్తున్న ఆధిపత్య పోరుతో పార్టీ ప్రతిష్ట మసకబారుతోందని సామాన్య కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్, మండల పరిధిలోని కీలక నాయకులు గ్రూపులుగా విడిపోవడంతో పార్టీ క్యాడర్ ఎటు వెళ్లాలో తెలియక అయోమయంలో పడిపోయింది. నాయకుల తీరు 'ఎవరికి వారే యమునా తీరే' అన్న చందంగా తయారైందని స్థానిక రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.


**సీనియర్లకు తప్పని అన్యాయం.. కొత్తవారికే ఆదరణ!**

పార్టీ అధికారంలోకి రాకముందు, విపక్షంలో ఉన్నప్పుడు లాఠీ దెబ్బలు తిని, కేసులను ఎదుర్కొని పార్టీ జెండాను మోసిన సీనియర్ నాయకులకు ప్రస్తుతం సముచిత న్యాయం దక్కడం లేదనే ఆవేదన తీవ్రంగా వ్యక్తమవుతోంది. ఇటీవల ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన 'కొత్త' వలస నాయకులకే పదవులు, అధికారిక ఆదరణ దక్కుతున్నాయని, తాము మాత్రం కేవలం జెండాలు మోయడానికే పరిమితమయ్యామా అని సీనియర్లు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. కీలక నిర్ణయాల్లో తమను సంప్రదించకుండా పక్కన పెట్టడంపై స్థానిక సీనియర్ల వర్గం తీవ్ర అసంతృప్తితో ఉంది.

**మండల వర్సెస్ టౌన్.. చీలిపోయిన పార్టీ!**

చౌటుప్పల్ కాంగ్రెస్ స్పష్టంగా 'మండల కాంగ్రెస్', 'టౌన్ కాంగ్రెస్' అనే రెండు వర్గాలుగా చీలిపోయినట్లు నియోజకవర్గ వ్యాప్తంగా చర్చ సాగుతోంది. రెండు వర్గాల మధ్య అంతర్గత పోరు ఏ స్థాయికి చేరిందంటే.. ఒక వర్గం నిర్వహించే కార్యక్రమాలకు మరో వర్గానికి చెందిన కొందరు నాయకులు దూరంగా ఉండటం, విడివిడిగా కార్యక్రమాలు నిర్వహించడం వంటి పరిణామాలు కార్యకర్తల్లో చర్చకు దారితీస్తున్నాయి. అయితే ఈ అంశంపై సంబంధిత నాయకులు బహిరంగంగా స్పందించలేదు.

### చౌటుప్పల్ కాంగ్రెస్‌లో వర్గపోరు: నలిగిపోతున్న 'హస్తం'!




## రాజగోపాల్ రెడ్డి అసంతృప్తి.. పొంచివున్న వలసల భయం!

చౌటుప్పల్ కాంగ్రెస్ లోని ఈ గ్రూపు తగాదాలపై స్థానిక మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. నియోజకవర్గంలో పార్టీ ప్రతిష్ట దెబ్బతినేలా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇది ఇలానే కొనసాగితే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ కు గట్టి దెబ్బ తగులుతుందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ లో వచ్చిన ఈ చీలికల వల్ల తీవ్ర నైరాశ్యంలో ఉన్న కార్యకర్తలు.. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల వైపు చూసే ప్రమాదం ఉందని, ఇప్పటికే వలసలపై అంతర్గత చర్చలు సాగుతున్నాయని క్షేత్రస్థాయి క్యాడర్ బహిరంగానే చర్చించుకుంటోంది. ఇప్పటికైనా జిల్లా, రాష్ట్ర స్థాయి హైకమాండ్ నేతలు చౌటుప్పల్ కాంగ్రెస్‌పై ప్రత్యేక దృష్టి సారించి, ఇరు వర్గాలను ఒకతాటిపైకి తెచ్చి సీనియర్లకు న్యాయం చేయాలని స్థానిక కాంగ్రెస్ శ్రేణులు కోరుతున్నాయి.



# గురుకులాల్లో వికటిస్తున్న ఆహారం.. ప్రభుత్వ నిర్లక్ష్యంపై 'బీఆర్ఎస్వీ' ఆగ్రహం

- అమ్రాబాద్ ఘటనపై మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేష్ ధ్వజం
- బాధిత విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్



**తొలివెలుగు, మునుగోడు:** నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ గురుకుల పాఠశాలలో పురుగులున్న కిచిడి తిని విద్యార్థులు అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలైన సంఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని బీఆర్ఎస్వీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేష్ ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని గురుకులాల్లో వరుసగా చోటుచేసుకుంటున్న ఇటువంటి ఘటనలు విద్యార్థుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయన్నారు. గత రెండేళ్లుగా గురుకులాల్లో ఫుడ్ పాయిజనింగ్, కలుషిత నీటి కారణంగా వందలాది మంది విద్యార్థులు అనారోగ్యాల బారిన పడుతున్నా ప్రభుత్వం ఆశించిన స్థాయిలో చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. కనీసం సురక్షితమైన తాగునీరు, వంట నీరు, నాణ్యమైన ఆహార నిల్వ వసతులు కూడా కల్పించలేని స్థితిలో విద్యాశాఖ ఉందా అని ఆయన ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్వీ తరఫున పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. అమ్రాబాద్ ఘటనలో అస్వస్థతకు గురైన విద్యార్థులకు తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఇందుకు కారణమైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని గురుకులాల్లో ఆహార నాణ్యతపై తక్షణమే ఉన్నతాధికారులతో తనిఖీలు నిర్వహించి విద్యార్థుల ప్రాణాలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

# చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

- అధికారుల సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం




**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి :** జిల్లాలో చిన్నారుల ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రియలను మరింత వేగవంతం చేయాలని, ప్రతి ఒక్కరికీ ఆధార్ సేవలు సకాలంలో అందేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో ఆధార్ సేవల పురోగతి, పెండింగ్ వెరిఫికేషన్లు, పాఠశాల విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేట్ అంశాలపై కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 0 నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారుల ఆధార్ నమోదు కోసం ఆసుపత్రుల్లో వ్యాక్సినేషన్ సమయంలోనే తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో మహిళా శిశు సంక్షేమ, ఆరోగ్య, పోస్టల్ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 5 నుంచి 15 ఏళ్ల వయస్సు గల పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితంగానే అందుబాటులో ఉన్నందున, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. 18 ఏళ్లు పైబడిన వారి పెండింగ్ వెరిఫికేషన్లను గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు, ప్రవేశ పరీక్షల సమయంలో ఇబ్బందులు రాకుండా ప్రజలు ముందే ఆధార్ అప్‌డేట్ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎస్పీ అక్షాంశ్ యాదవ్, అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, యూఐడీఏఐ హైదరాబాద్ ఆర్వో నరేష్ చంద్ర, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సాయి కుమార్, డీఈఓ, ఎల్డీఎం తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

- 10 పశువుల స్వాధీనం.. వాహనం సీజ్
- సూర్యాపేట జిల్లాకు చెందిన డ్రైవర్‌పై కేసు నమోదు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా తరలిస్తున్న 10 పశువులను పోలీసులు పట్టుకున్నారు. చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ కె. రాంబాబు, కానిస్టేబుల్ సీతారాం రెడ్డిలు పెట్రో మొబైల్ వాహనంలో పంతంగి టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టారు. నల్గొండ మార్గం నుంచి హైదరాబాద్ వైపు అక్రమంగా పశువుల రవాణా జరుగుతుందనే సమాచారంతో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వచ్చిన అశోక్ లేలాండ్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, ఎలాంటి అనుమతులు లేకుండా ఇరుకైన రీతిలో తరలిస్తున్న 10 పశువులను (5 ఆవులు, 5 ఎద్దులు) గుర్తించారు. వాహన డ్రైవర్ ఎస్కే కరీముల్లా బాబా (సూర్యాపేట జిల్లా, నడిగూడెం)ను విచారించగా, కోదాడ వారపు సంతలో వీటిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు అంగీకరించాడు. దీంతో పశువులను, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మన్మథ కుమార్ తెలిపారు.





# బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

- బీఎల్‌ఏల సమీక్షలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
- ఓటర్ల జాబితాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచన

**తొలివెలుగు, వలిగొండ:** బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంలో బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏ) పాత్ర అత్యంత కీలకమని భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం వలిగొండ పట్టణంలోని తన నివాసంలో ఆయన పట్టణ పరిధిలోని బీఎల్‌ఏలతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓట్ల నమోదు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఎల్‌ఏలు ఓటర్ల జాబితాపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ, తమ పరిధిలోని ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని, అదే సమయంలో అనర్హుల పేర్లు, ఇతర అభ్యంతరాలను గుర్తిస్తే వెంటనే పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వలిగొండ పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, బీఎల్‌ఏలు పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో విద్యాసంస్థల బంద్ విజయవంతం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి: ఎస్ఎఫ్ఐ
- మండల వ్యాప్తంగా నిలిచిన తరగతులు



**తొలివెలుగు, చౌటుప్పల్:** విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎఫ్ఐ, వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం చౌటుప్పల్ మండలంలో విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఆసరా ప్రకాష్, కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.10,500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిధుల విడుదలలో జాప్యం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకే పరిమితం చేసే ఆలోచనను వీడాలని, ఖాళీగా ఉన్న డీఈఓ, ఎంఈఓ, ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. విద్యార్థులపై ఆర్థిక భారం మోపే జీవో నంబరు 7, 8, 9లను ఉపసంహరించుకోవాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్ చేశారు. చౌటుప్పల్ కేంద్రంతో పాటు తంగడపల్లి, చిన్నకొండూరు, కొయ్యలగూడెం, దేవలమ్మ నాగారం తదితర గ్రామాల్లో బంద్ విజయవంతమైందని, సహకరించిన యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దోనూరు శ్రావణ్, వరుణ్ తేజ్, మల్లేష్, మణికంఠ, సిద్దు తదితరులు పాల్గొన్నారు.





## ధర్మారెడ్డి కాలువకు 'మహర్దశ'.. వేల ఎకరాలకు సాగునీరు

- రూ.124 కోట్ల పనులను తనిఖీ చేసిన ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి
- 17న కాలువకు నీళ్లు.. రైతన్నల్లో ఉత్సాహం



**తొలివెలుగు, వలిగొండ:** భువనగిరి నియోజకవర్గ పరిధిలోని ధర్మారెడ్డి కాలువకు రూ.124 కోట్ల వ్యయంతో పునర్జీవం పోస్తున్నట్లు భువనగిరి శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. వలిగొండ మండలం సంగెం, ధర్మారెడ్డిపల్లి, గోకారం గ్రామాల పరిధిలో సాగుతున్న కాలువ ఆధునికీకరణ, కాలువ వెంట రహదారి నిర్మాణ పనులను శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలువ వెడలు , లోతు, నాణ్యతా ప్రమాణాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మట్టి, పిచ్చిమొక్కలు పేరుకుపోయి కాలువ శిథిలావస్థకు చేరిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని భారీ నిధులతో ఆధునిక సాంకేతికతతో పనులు చేపట్టిందన్నారు. ఈ నెల 17వ తేదీన కాలువకు సాగునీరు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. దీనివల్ల సంగెం, ధర్మారెడ్డిపల్లి, గోకారం, వర్కట్‌పల్లి పరిధిలోని వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సమస్య తీరుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన మూసీ ప్రక్షాళనలో భాగంగా సంగెం బ్రిడ్జి మంజూరు కావడం ఈ ప్రాంత అభివృద్ధికి మైలురాయి అని పేర్కొన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యానికి 'అల్బెండాజోల్' రక్ష



- ఈ నెల 13న నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం
- 1-19 ఏళ్ల పిల్లలందరికీ ఆల్బెండాజోల్ మాత్రలు వేయించాలి
- ఉపాధ్యాయులు, అంగన్‌వాడీల సమన్వయంతో విజయవంతం చేయాలి
- తంగడపల్లి వైద్యాధికారి డాక్టర్ కాటం రాజు

**తొలివెలుగు, చౌటుప్పల్:** దేశవ్యాప్తంగా ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని (ఎన్‌డీడీ) మండలంలో విజయవంతం చేయాలని తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చింతకింది కాటం రాజు అన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణపై శుక్రవారం ఆయన ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాటం రాజు మాట్లాడుతూ.. మండల పరిధిలోని 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ తప్పనిసరిగా ఆల్బెండాజోల్ మాత్రలు వేయించాలన్నారు. సోమవారం (జూలై 13) జరగబోయే ఈ విడతలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతి విద్యార్థికి ఈ మాత్రలు అందజేస్తామన్నారు. ఏదైనా కారణం చేత ఆ రోజు మాత్రలు వేసుకోని పిల్లల కోసం తిరిగి ఈ నెల 20వ తేదీ (సోమవారం) 'మోప్-అప్' రౌండ్ నిర్వహించి, మిగిలిపోయిన వారందరికీ వేస్తామని వివరించారు. పిల్లల మెరుగైన ఆరోగ్యం కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యతగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.




## రైతులకు పారదర్శకంగా సేవలందించాలి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య
- ఘనంగా ఆత్మకూరు (ఎం) పిఏసీఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం):** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు మరింత చేరువై పారదర్శక సేవలతో వ్యవసాయ రంగ బలోపేతానికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం పిఏసీఎస్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, నూతన చైర్మన్ యాస లక్ష్మారెడ్డితో పాటు డైరెక్టర్లు పోతగాని మల్లేష్, శ్రీరాముల భవనా ఋషి, సుగూరి హరిబాబు, వనం బాలయ్య, కూరెళ్ళ యాదమ్మ, భాషపోయిన సత్యనారాయణ, బీసు వెంకటయ్య, కొడిత్యాల పద్మ, గంధమల్ల నరసయ్య, పంతుల భూపాల్, బొల్లెపల్లి శ్రీనివాస్, జట్ట ధనంజయలతో ప్రమాణ స్వీకారం చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, రుణాలు సకాలంలో అందించడంతో పాటు పంట కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హ గడపకూ చేరేలా పాలకవర్గం సమన్వయంతో పనిచేసి రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గాన్ని ఆత్మకూరు మాజీ జెడ్‌పీటీసీ కోడిత్యాల నరేందర్ గుప్తా శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సహకార శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.







## వలిగొండలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

- విద్యాశాఖను బలోపేతం చేయాలి: వామపక్ష విద్యార్థి సంఘాలు
- మండల వ్యాప్తంగా నిలిచిన తరగతులు

**తొలివెలుగు, వలిగొండ:** విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం వలిగొండ మండల వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెల్లంకి మహేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వెంటనే రెండు జతల యూనిఫామ్‌లను అందించాలని, సంక్షేమ వసతి గృహాలకు శాశ్వత సొంత భవనాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకే పరిమితం చేసే ఆలోచనను వీడాలని, ఖాళీగా ఉన్న మండల విద్యాధికారుల (ఎంఈఓ) పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని వర్తింపజేయాలని, రాష్ట్రానికి పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల వద్ద ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులు నిలిపేలా రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు. బంద్‌కు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా సహకరించాయి. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వలిగొండ మండల అధ్యక్షుడు మైసొల్ల నరేందర్, పట్టణ అధ్యక్షుడు భువనగిరి సాయి, సల్మాన్, చంద్ర, రోహన్, శివ, సాయి, కార్తీక్, ప్రణీత్, ఏసోఫ్, ఏఐఎస్ఎఫ్ మండల కన్వీనర్ బాలగోని మత్యగిరి, కనకబోయిన నందు, ఏఐఎస్ఎఫ్ నాయకులు కన్నెబోయిన శివసాయి, కనకబోయిన జస్వంత్, కూర అక్షయ్, ఆవుల మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



## కుంట్లగూడెం చేనేత సంఘం ఎన్నికల్లో 'సుదర్శన్' ప్యానెల్ క్లీన్ స్వీప్!

ఆరుగురు డైరెక్టర్ల గెలుపుతో చేజిక్కనున్న చైర్మన్ పీఠం

డైరెక్టర్లుగా తొమ్మిది మంది ఎన్నిక.. కూడలిలో సంబరాలు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్ మండలం కుంట్లగూడెం చేనేత సహకార సంఘం ఎన్నికల ఫలితాలు విడుదలయ్యాయి. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల్లో నూతన పాలకవర్గ డైరెక్టర్లుగా వల్లకాటి అనిల్ కుమార్, గుండు గోవర్ధన్, మిర్యాల గోవర్ధన్, తిరందాసు నరసింహ, తిరందాసు వేణు కుమార్, వనం సుదర్శన్, సీత మధుసూదన్, గుండు లక్ష్మి, వనం వేనమ్మలు విజయం సాధించారు. మొత్తం స్థానాల్లో వనం సుదర్శన్ నేతృత్వంలోని ప్యానెల్ స్పష్టమైన ఆధిక్యతను కనబరిచింది. సుదర్శన్ ప్యానెల్ తరఫున ఆరుగురు డైరెక్టర్లు విజయం సాధించడంతో సంపూర్ణ మెజారిటీ లభించింది. ఈ సమీకరణాల నేపథ్యంలో చేనేత సహకార సంఘం నూతన చైర్మన్‌గా వనం సుదర్శన్ ఎన్నికయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని సహకార రంగ నిపుణులు భావిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో చేనేత కార్మికులు, ప్యానెల్ మద్దతుదారులు హర్షం వ్యక్తం చేశారు.

## గంజాయి ఊబిలో యువత.. హైదరాబాద్‌లో భారీ డ్రగ్స్ రాకెట్ బట్టబయలు

హైదరాబాద్ నగరంలో మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రత్యేకంగా పనిచేస్తున్న ఈగల్ ఫోర్స్ (ఈలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) చేపట్టిన మెరుపు దాడుల్లో మరో భారీ గంజాయి రాకెట్ వెలుగులోకి వచ్చింది. ప్రజలు అందించిన సమాచారంతో ఈగల్ ఫోర్స్ అధికారులు వేగంగా స్పందించి నిర్వహించిన దాడుల్లో గంజాయి విక్రయిస్తున్న ముఠాను గుర్తించి కీలక నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1908కు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ పరిధిలోని ఫతేనగర్ ప్రాంతంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అక్కడ గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు నిర్ధారించుకున్న అనంతరం అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గంజాయి విక్రయిస్తున్న ఆకాశ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 17.8 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

## వ్యక్తి అదృశ్యం... మిస్సింగ్ కేసు నమోదు...



**తొలివెలుగు, చౌటుప్పల్:** ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల గ్రామానికి చెందిన కారింగుల జగదీష్ (34), తండ్రి నరసింహారావు, ప్రస్తుతం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని కాటమయ్య కాలనీలో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం సుమారు 7.30 గంటల సమయంలో జగదీష్ ఇంట్లో ఎవరికీ సమాచారం ఇవ్వకుండా బయటకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాత్రి అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య కారింగుల మౌనిక ఆందోళనకు గురై బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ అతడి ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. దీంతో శుక్రవారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఇన్‌స్పెక్టర్ మన్మథ కుమార్ తెలిపారు. జగదీష్ ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా 8712662744, 8712662481, 8712662503 నెంబర్లను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## కేఎల్ఐ కాల్వ మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు ఒక జెసిబి స్వాధీనం.. కేసు నమోదు

**తొలివెలుగు, కల్వకుర్తి:** కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామంలోని కేఎల్ఐ కాల్వ నుండి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మరియు జెసిబి ని స్వాధీనం చేసుకుని స్టేషన్కు తరలించినట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. ఇట్టి వాహనాల డ్రైవర్లు, ఓనర్ల పై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను, మట్టిని తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

